# తొలిచూపు

**ఎల్.డి.సి. శివానందం ఆ ఊరికి బదిలీ అయి వచ్చాడు. ఉన్న సెలవులయిపోయాయి. జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలంటూ ఆదరాబాదరాగా ఆఫీసుకు వెళ్లిపోయాడు.**

శివానందం ఆ ఇంటిలో చేరి వారమైంది. పిండికొద్దీ రొట్టె అన్నట్లు అది రెండు గదుల అద్దె ఇల్లు. వంటగది. ఆ గదికి ఆనుకొని స్నానాల గది. ఇక మిగిలింది హాలు. బాత్‌రూం నుండి బయటకు రావాలన్నా, లోపలికి పోవాలన్నా హాలుగుండా వెళ్లాల్సిందే. హాలు చాలా విశాలంగా ఉంది. హాలును రెండుభాగాలు చేయించి ఒక గదిని పడకగదిగా ఉపయోగించుకుంటే సరిపోతుందనుకున్నాడు. ఏం లేకున్నా రాత్రికి పక్కన పెళ్లాముండాలి కదా! అదీ శివానందం ఆలోచన.

శివానందం భార్య అరుణ. వయసులో ఉన్నప్పుడు అందగత్తె. యాభై ఏళ్లు దాటినా ఇప్పటికీ నదరుగానే కనిపిస్తుంది. పెళ్లయిన కొత్తల్లో మొగుణ్ణి కట్టి పడేసుకొందిగానీ, శివానందం తాగుడు మరిగాక ఆవిడ పప్పులేం ఉడకడం లేదు. అరుణ ఉన్నంతలో సర్దుకుపోవడం నేర్చుకుంది. ఆవిడ కిచెన్‌లో వంట ప్రయత్నాల్లో తల మునకలై ఉంది.

శివానందానికి ఒక కొడుకు, ఒక కూతురు. కొడుకు బాగా చదివి ప్రస్తుతం హైదరాబాదు సెక్రటేరియట్‌లో పనిచేస్తున్నాడు. ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఇంటికి పైసా ఇవ్వడు, నాన్న దుబారా మనిషని.

శివానందం కుమార్తె జలజాక్షి. సార్థక నామధేయురాలు. బి.ఎ. మూడవ సంవత్సరం చదువుతున్నది. ఐదున్నర అడుగుల పొడగరి. ఆరోగ్యంగా, పొంకంగా పిటపిటలాడే శరీరంతో అందంగా ఉంటుంది.



హాలు తలుపులు ఓరగా వేశాం గదా! మన అడను ఎవరికి తెలుస్తుంది. మన ఇంటికి ఎవరొస్తారనే ఉద్దేశ్యంతో స్నానాల గదికి వెళ్లింది జలజాక్షి. శ్రావ్యమైన కంఠస్వరంతో హమ్మింగ్ మొదలుపెట్టింది. నవనవలాడే తన శరీర సౌందర్యాన్ని చూసి తనకు తానే మురిసిపోతున్నది. తలస్నానం చేసిందేమో తలకు టవల్ చుట్టుకొని శాండిల్ సోపు పరిమళాలు వెదజల్లుతున్న శరీరంతో తన బట్టలున్న హాల్లోని సోఫా వద్దకు వెళ్లింది. అప్పటికి ఆమె శరీరంపై పావడా ఒక్కటే ఉంది.

ఇంతలో గడియ బిగించని తలుపెవరో తోసుకుంటూ లోనికి వచ్చారు. ఎదురుగా కనిపిస్తున్న అందాలకు స్తబ్ధుగా నిలబడిపోయాడు. కనులు మూయడం మరిచాడు. తెరచిన నోరు తెరచినట్టుండిపోయింది. ముందుకు రావాలో, వెనక్కు వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి.

తలుపు తెరచిన సవ్వడికి జలజాక్షి ఎవరబ్బా! అనుకుంటూ అటు చూసింది. గుండె ఝల్లుమంది. ఎవరో అపరిచితుడు. మన్మథుడిలా ఉన్నాడు. టక్ చేశాడు. వంకీల క్రాఫు నుదురును కాస్త కప్పేసింది. అచ్చం సినీ హీరో శ్రీకాంత్‌లా ఉన్నాడు. తొలిచూపులోనే బాగా నచ్చాడు. అంతా క్షణంలో సగం సేపే. అనుకోని సంఘటనకు ఆవిడ బిత్తరపోయింది. సిగ్గుతో కుంచించుకుపోయింది. కనీసం తన శరీరంపై 'బ్రా' కూడా లేదన్న విషయం గుర్తుకు వచ్చింది. తటాలున సోఫాలో ఉన్న తన బట్టలు ఎత్తుకొని వంటగదిలోకి పరుగెత్తింది. బట్టలు ధరించి సిగ్గుపడుతూనే ఎవరో చూద్దామని హాల్లోకి వచ్చింది.

"హలో, మేడం! డోర్ నెంబరు సరిగ్గా చూడలేదు. ఈ క్వార్టర్స్‌లోని ఇళ్లన్నీ ఒకే మోడల్‌లో ఉన్నాయి కదండీ! మా రాధక్కా వాళ్ల ఇల్లనుకొని మీ ఇంటికొచ్చాను. మిమ్మల్ని...ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు" అన్నాడు.

జలజాక్షి అతని ధైర్యానికి అచ్చెరువొందింది. మరెవరయినా అయితే ఈపాటికి పారిపోయేవారు. అయిందేదో అయింది. వచ్చినవాడు తనలో చూడవలసిన అందాలన్నీ అప్పనంగా చూసేశాడు. తిడితే గిడితే మరింత రసాభాస అవుతుంది. ఈ విషయం బయట వారికెవరికి తెలిసినా అప్రదిష్ట తనకే. మగాడికేంటి ఈ సంఘంలో కాలరెత్తుకు తిరిగేస్తాడు. ఇప్పుడు ఈ విషయం బయటకు పొక్కకుండా చూసుకోవాలి. తనిప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. చాకచక్యంతో ఎదురైన సమస్యను పరిష్కరించుకోవాలి. వస్తున్న కోపాన్ని తనలోనే అణచుకొంది. కొద్దిగ నవ్వు ముఖంతో "సరే, సరే! పొరబాటున పరాయి ఇంటికి వచ్చారు. ఇందులో మీ పొరబాటుందని నేనూ అనుకోవడం లేదు. వచ్చినవారు వెళ్లిపోకుండా ఇంకా ఇక్కడెందుకున్నారు?"

"ఏమిటండీ! నేనంత సంస్కారం తెలియనివాడిని కాను. చేసిన పొరబాటుకు సారీ చెప్పి వెళదామని ఉన్నాను. మీరు నన్ను క్షమించాననేదాకా, మీరు నన్ను మెడపట్టుకు గెంటినా వెళ్లనంటే వెళ్లను."

"అయ్యో! మీరింకా నిలబడే ఉన్నారు కదండి. మీరు మా పక్కింటి రాధగారి సోదరులంటున్నారు. ఇంటికి వచ్చినవారి నాదరించడం, ఆతిథ్యమివ్వడం మన ఆచారం కదా! కూర్చొండి. ఎలాగూ వచ్చారు కాస్త కాఫీ తాగి వెళుదురుగానీ..."

"ఎందుకండీ. మిస్..."

"నా పేరు జలజాక్షి. పర్వాలేదు కూర్చోండి" అంటూనే వంట ఇంటిలోనికి పరుగున వెళ్లి ఫ్లాస్కులోని కాఫీ తెచ్చి ఇచ్చింది.

"మీ చేతి కాఫీ అమృతంలా ఉందండి. మీ ఆతిథ్యానికి చాలా థాంక్స్. అన్నట్టు నాపేరు చెప్పనేలేదు కదూ! నా పేరు శ్యాంప్రసాద్. వెళ్లొస్తానండి. బై" అంటూ తిరిగి తిరిగి చూస్తూ వెళ్లిపోయాడు.

* * *

మరునటిరోజు రాధ శివానందంగారి ఇంటికి తన భర్త రాంబాబుతో పాటు వచ్చింది.

"శివానందంగారూ! మా శ్యాంప్రసాద్ నిన్న మీ అమ్మాయి జలజాక్షిని చూశాడట. తొలిచూపులోనే మీ అమ్మాయి నచ్చిందట. పెళ్లి చేసుకుంటే మీ అమ్మాయినే చేసుకుంటానంటున్నాడు. మావాడు జూనియర్ ఇంజనీరు. నెలకు ఇరవై వేల జీతం. మీకు ఇష్టమైతే త్వరలో నిశ్చితార్థం చేసుకుందాం. వాడికి అమ్మా, నాన్నా లేరు. వాడికి పెళ్లిపెద్దలం మేమే. మీరు ఓ.కె అంటే చాలు" అన్నాడు రాంబాబు.

"మేము కట్నాలు, కానుకలు గొప్పగా ఇచ్చుకోలేమండీ, ముందు అమ్మాయి డిగ్రీ పూర్తి కావాలి గదా!"

"కట్నాలు, కానుకలు అంటే మాకంత పట్టింపు లేదండి. అబ్బాయి కట్నం ఏమీ వద్దంటున్నాడు. అయినా మీకు తోచినంత ఇవ్వండి. సింపుల్‌గా పెళ్లిచేసి ఇవ్వండి. మాకంతే చాలు."

అరుణ, శివానందం వంటగదిలోకి వెళ్లారు. అక్కడున్న జలజాక్షి అభిప్రాయం అడిగారు. అంతా ఓ.కే. అనుకున్నారు. ఒక శుభముహూర్తాన జలజాక్షి, శ్యాంప్రసాదుల వివాహం గుళ్లో జరిగిపోయింది. కోరిన పెళ్లాం వచ్చినందుకు శ్యాంప్రసాద్ సంబరపడ్డాడు. అప్పు చేయకుండా కూతురి పెళ్లి జరిగినందుకు అరుణ, శివానందం ఇద్దరూ సంతోషించారు. జలజాక్షి ఇదంతా తన ప్రయోజకత్వమేనంటూ సంతసించింది.

**-కలవకుంట్ల గురునాథశెట్టి (మదనపల్లి)**